క్లుప్తంగా

ఉత్తమ రైతుకు సన్మానం



రెంజల్(బోధన్): డివిజన్ స్థాయిలో ఉత్తమ రైతుగా ఎంపికైన బాగేపల్లికి చెందిన సాయిబా బాగౌడ్ అనే రైతును కూనేపల్లి గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలోని పలువురు రైతులకు ఉత్తమ ఆదర్శ రైతులుగా ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ ఎంపిక చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగం, కిష్టయ్య, లక్ష్మణ్, సాయిలు, విజయ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మేరు సంఘం ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మేరు సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. గురువారం అధ్యక్ష పదవికి రాజులదేవి, రవినాథ్‌లు తమ నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారి పోల్కం నారాయణకు అందజేశారు. కార్యక్రమంలో మేరు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటు

మాక్లూర్: సాగునీటి ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయంలో పూర్తయితే సంబరాలను బీఆర్ఎస్ పార్టీ జరుపుకోవటం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో జిల్లాలోని నవీపేట మండలంలో అల్లీసాగర్, నందిపేట మండలంలో గుత్ప ఎత్తిపోతల పథకాలు చేపట్టి పూర్తి చేశారన్నారు. పూడుకుపోయిన కాల్వలు, చెరువుల మరమ్మతులను చేయించి ఈ రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువులను నింపి ఉమ్మడి కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సాగునీరు, తాగునీరు కొరత తీర్చారన్నారు. ఇందులో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీలేదన్నారు. అధికారం చేపట్టిన ఈ 9 ఏళ్ల కాలంలో రైతుల్ని ఇబ్బంది పెట్టే కార్యక్రమాలు తప్ప మేలు చేసిందేమి లేదని విమర్శించారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ నిర్వహిస్తున్న నెల రోజుల సంబరాల వల్ల ప్రజాధనం దుర్వినియోగం తప్ప ప్రజలకు ఒరిగేది ఏమీ లేదన్నారు.

అన్నదానం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని సాయిబాబా ఆలయంలో గురువారం అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యాలో పాల్గొని బాబాను దర్శనం చేసుకున్నారు. అన్నదాతగా చేపూర్ ఎంపీటీసీ బాల నర్సయ్య వ్యవహరించారు. సర్పంచ్ టి. సాయన్న, ఆలయ కమిటీ సభ్యులు రాజారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత క్షమాపణ చెప్పాలి

ఆర్మూర్: ఇటీవల ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని మాక్లూర్ మండలంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకుంటూ నియోజకవర్గ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఐ ఆర్మూర్ నియోజకవర్గ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు గురువారం డిమాండ్ చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో జీవన్‌రెడ్డికి ఎదురుగా పోటీ చేయాలంటే అమ్మోరుతల్లి ముందర మేక పిల్లను నిలబెట్టినట్లే అంటూ ఎమ్మెల్సీ కవిత చేసిన వాఖ్యలను ఆయన తప్పుబట్టారు. తమ కుటుంబం వల్లనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందనే విధంగా మాట్లాడటం తగదన్నారు. ఎమ్మెల్సీ హోదాలో ఉండి ప్రతిపక్ష పార్టీల వారిని ఎన్నికల సమయంలో భయభ్రాంతులకు గురి చేసే విధంగా మాట్లాడటం సరికాదన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



రుద్రూర్: రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో సంబరాలను ఘనంగా నిర్వహిస్తోందని, ఐతే ప్రజలకు ఇచ్చిన హామీల సంగతి ఏమిటని సీపీఐఎంఎల్ ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి మల్లేష్ ప్రశ్నించారు. మోస్రా తహసీల్ కార్యాలయం వద్ద బీడీ కార్మికులతో కలిసి గురువారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ సాయిలుకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో అమరుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం లేదని విమర్శించారు. ఇళ్లు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఇవ్వలేదని, అర్హులైన వారందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా చెరువుల పండుగ



మాక్లూర్‌లో చెరువుల పండుగలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు



వేల్పూర్ మండల కేంద్రంలో బోనాలతో చెరువుల పండుగ నిర్వహిస్తున్న స్థానికులు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు ప్రజాప్రతినిధులు, అధికారులు బోనాలతో ఊరేగింపుగా చెరువుల వద్దకు వెళ్లారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అందిరితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఉప్లూర్‌లో వల గొడుగు ప్రదర్శిస్తూ బోనాలతో చెరువు వద్దకు వెళ్తున్న మత్స్యకారులు



సాలూర మండల కేంద్రంలో..



మెండోరా మండలం బుస్సాపూర్‌లో..



జలాల్‌పూర్‌లో వలగొడుగుతో ఊరేగిస్తున్న గ్రామస్తులు



వల్లభాపూర్‌లో పాల్గొన్న ప్రజలు



వెల్మల్‌లో సంబరాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



రుద్రూర్ మండలం అంబం(ఆర్)లో బతుకమ్మతో మహిళలు



రెంజల్‌లో బతుకమ్మతో మహిళలు



మోస్రా మండలం గోవూర్‌లో...

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే

ఆర్మూర్‌టౌన్: ఢిల్లీ కేంద్రంగా బీఆర్ఎస్, బీజేపీలు ఒక్కటై కాంగ్రెస్ పార్టీని అడ్డుకోవటానికి చేతులు కలిపాయని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్ ఆరోపించారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని ఎందుకు బంగాళాఖాతంలో కలపాలని అడిగారు. దేశానికి స్వాతంత్రం తీసుకు వచ్చినందుకా లేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చినందుకా లేక అన్ని రంగాల్లో దేశాన్ని, రాష్టాన్ని అభివృద్ధి చేసినందుకా అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు కొల వెంకటేష్, సాయిబాబా గౌడ్, విట్టం జీవన్, మీర్ మాజీద్, పోశెట్టి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ చైర్మన్ మార చంద్రమోహన్

మద్దతు ధర పెంచడం హర్షణీయం





ఆర్మూర్ పట్టణంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు రుద్రూర్‌లో..

కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధర తగ్గించడంతో పాటు మద్దతు ధరను పెంచినందుకు జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి ఈ సందర్భంగా పాలాభిషేకాలు చేశారు. వరి ధాన్యానికి రూ.143లను పెంచడంతోపాటు ప్రతి ఎరువు బస్తాపై రూ.200 తగ్గించిందని నాయకులు పేర్కొన్నారు.

–ఆర్మూర్‌టౌన్/నవీపేట/రుద్రూర్/రెంజల్



నవీపేటలో..



నీలాలో పాలాభిషేకం చేస్తున్న రైతులు

చేప పిల్లలకు బదులు డబ్బులు జమ చేయండి



ఎడపల్లి(బోధన్): మత్స్య సహకార సంఘాలలో ఇతర కులస్తులను చేర్చుకోవద్దని, చేప పిల్లలకు బదులు అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని గురువారం డిమాండ్ చేశారు. మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులు ఎడపల్లిలో బోధన్- నిజామాబాద్ ప్రధాన రహదారిపై ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ, ధర్నాలు నిర్వహించారు. గ్రామ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మత్స్యకారులను చిన్నచూపు చూస్తుందని, ముదిరాజ్ కులానికి చెందిన వ్యక్తిని సంఘం అధ్యక్షుడిగా చేసిందన్నారు. తమ కుల వృత్తిని నిర్వీరం చేసే ప్రయత్నం చేస్తోందని నిరసన అన్నారు.

టెన్నికాయిట్ పోటీల్లో విజేతలకు అభినందనలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బాలుర పాఠశాల ఆవరణలో గురువారం 7వ అంతర్ జిల్లా సీనియర్ మహిళ, పురుషుల టెన్నికాయిట్ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులను టెన్నికాయిట్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్ అభినందించారు. ఈ నెల 2 నుంచి 4 వరకు జరిగిన టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో సింగిల్ విభాగంలో జిల్లాకు చెందిన టి.శిరీష, నవనీత, ప్రసన్నలు నిలిచారు. అలాగే జిల్లాకు చెందిన మరో క్రీడాకారిణి ఉమారాణి ఐదవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా పీఆర్‌టీయూ నేత పెంట జలంధర్, జిల్లా బేస్‌బాల్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి అభినందించారు.



ఆధ్యాత్మికం

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



నవీపేట: పోతంగల్‌లో రూ.90 లక్షల దేవాదాయ శాఖ నిధులతో నిర్మించిన శివపంచాయతన ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం దేవతామూర్తుల విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిశాయి. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో వేకువ జామున 3 గంటల సమయంలో ఈ ఉత్సవాలు జరిగాయి. నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దంపతుల ఉత్సవాలకు హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. జెడ్పీ చైర్మన్ విఠల్‌రావ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్‌రావ్, ఎంపీపీ సంగెం శ్రీనివాస్, జెడ్పీటీసీ నీరడి సవిత, సర్పంచ్ రవీందర్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీ హనుమాన్ ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో పురవీధుల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శివరాజ్ కుమార్, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, తదితరులున్నారు.

ఈ నెలలోనే 'గృహలక్ష్మి' ప్రారంభం

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



పడగల్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి

వేల్పూర్: సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఈ నెలలోనే గృహలక్ష్మి పథకం ప్రారంభమవుతుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన వేల్పూర్ మండలం పడగల్, బాల్కొండ మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఆత్మగౌరవ ప్రతీకగా సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మిస్తున్నారని చెప్పారు. బాల్కొండ నియోజకవర్గంలో మొత్తం పది ప్రాంతాల్లో 1,200 ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయని, ఇప్పటికే 800 ఇళ్లు పూర్తయినట్లు చెప్పారు. మరో 400 ఇళ్లు పురోగతిలో ఉన్నాయని, అవి కూడా త్వరలో పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 2 లక్షల ఇళ్లు పేదలకు నిర్మించి ఇచ్చామని, గృహలక్ష్మి ద్వారా మరో 3 లక్షల ఇళ్లు ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

వేసవిలోనూ నిండు కుండల్లా చెరువులు

- ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



మత్స్యకారులతో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆర్మూర్: సీఎం కేసీఆర్ సంకల్పంతో చేపట్టిన మిషన్ కాకతీయ పనులతో ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని 220 చెరువులు వేసవి కాలంలో సైతం నిండు కుండలను తలపిస్తున్నాయని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్, ఆలూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ మండలంలోని పిప్రి, చేపూర్, గోవిందపేట్ గ్రామాలతో పాటు ఆలూర్ మండల కేంద్రంలోని కిష్టం చెరువు సమీపంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. చెరువుల్లో నీటి నిలువతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగు వచ్చిందన్నారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కట్ట మైసమ్మకు పూజలు నిర్వహించి చెరువులకు జలహారతినిచ్చారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఊరేగింపుగా చెరువుల వద్దకు వచ్చి బోనాలను సమర్పించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఆర్మూర్ వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు నిండుగా ఉంటే ఊరంతా సంబరమే



బోనాలతో బయలుదేరుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి

- మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): ఊర్లో చెరువు నిండుగా ఉంటే ఊరిలోని ప్రజలు సంతోషంగా తాగునీటికి, సాగునీటికి ఇబ్బంది పడకుండా ఉంటారని మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఊరూర చెరువు పండుగ కార్యక్రమంలో భాగంగా బల్దియా కార్యాలయం నుంచి మున్సిపల్ చైర్ పర్సన్‌తో పాటు మహిళలు బోనాలతో బెల్లాల్ చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ గంగమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మిషన్ భగీరథలో భాగంగా చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని అన్నారు. అనంతరం సహ పంక్తి భోజనాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఈ లింగంపల్లి శివానందం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



బడిబాటలో పాల్గొన్న కౌన్సిలర్ ఖాందేష్ సంగీత

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని స్థానిక కౌన్సిలర్ ఖాందేష్ సంగీత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రెండవ వార్డులో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో పిల్లల సంఖ్యను పెంచడంతో పాటు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సేవలు, సౌకర్యాల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సంధ్యా రాణి , భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సమాచారం..

రేపు బోధన్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్

బోధన్: బోధన్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు 5వ జిల్లా అదనపు న్యాయమూర్తి, మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ రవికుమార్ గురువారం తెలిపారు. కేసుల పరిష్కారానికి మూడు బెంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

క్విజ్ పోటీల కోసం దరఖాస్తు చేసుకోండి



బోధన్‌టౌన్(బోధన్): ఈ నెల 18న నియోజకవర్గంలో నిర్వహిస్తున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలకు యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి కోరారు. బుధవారం బోధన్‌లోని కాంగ్రెస్ పట్టణ కార్యాలయంలో క్విజ్‌కు సంబంధించిన దరఖాస్తులను దగ్గరుండి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్విజ్ పోటీలో పాల్గొనాలకునే యువతీ, యువకులు ముందుగా 76618 99899 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని, వెంటనే రిజిస్ట్రేషన్ వెబ్‌లింక్‌తో కూడిన ఒక ఎస్ఎంఎస్ వస్తుందని, వివరాలను 1111 అనే రిఫరల్ కోడ్ ద్వారా ఈ నెల 17వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మోయినొద్దిన్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తలారి నవీన్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బడు, నాయకులు ఇనాయత్ అలీ, సాయిలు, జావిద్ పాల్గొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

నిజామాబాద్‌అర్బన్: గుర్తింపులేని ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ మనోజ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మనోజ్ మాట్లాడుతూ.. జిల్లాలో అనుమతి లేకుండా నడుస్తున్న ప్రయివేటు పాఠశాలలు, అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. ఏబీవీపీ నాయకులు దామ సునీల్, రోహిత్ ఉన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – అనంత 11.10, కౌశిక్ శర్మ-1.10
స్పైడర్ మాన్(తెలుగు)-3.30
మేమ్ ఫేమస్ -6.35
పరేషాన్ -9.45

స్క్రీన్-2 – ట్రాన్స్‌ఫార్మర్స్ -10.40, 1.35, 4.30, 7.25, 10.20

స్క్రీన్-3 – టక్కర్ 12.20 , 6.30 ,9.30
మేమ్ ఫేమస్ 3.20

స్క్రీన్-4 – అన్‌స్టాపబుల్ 10.35 7.00
ఇంటింటి రామాయణం 4.05 9.35